నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, బుధవారం 9 ఏప్రిల్ 2025 HYDERABAD

# ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలి..

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**



కాప్రా ఏప్రిల్ 8: బీఆర్ఎస్ట్ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేద్దామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సైనిక్‌పురిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేకతను వరంగల్ సభా వేదికగా ఎండగట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే పిలుపు ఇచ్చారు. రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఉప్పల్‌లో గులాబీ జెండా ఎగురేయాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన ఫెయిల్ అయిందని.. హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలను నాశనం చేయడంతో పాటు.. హెచ్‌సీయూ భూముల అమ్మకాల పేరుతో మూగజీవాల ఉసురు తీశాడని.. ఈ పాపం ఊరికే పోదన్నారు. ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున వరంగల్ సభకు తరలిరావాలని ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



శంషాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి తదితరులు






- ఈ నెల 27న వరంగల్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ
- పదేండ్లు స్వర్ణయుగం.. కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు
- వరంగల్‌కు తండోపతండాలుగా కదిలిరావాలని తలసాని పిలుపు
- నేడు, రేపు కార్యకర్తలతో సమావేశం
- 13న నియోజకవర్గాల వారీగా మీటింగ్‌లు
- 20న తెలంగాణ భవన్‌లో జనరల్ బాడీ మీటింగ్

సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీలు వాణీదేవి, దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్ తదితరులు

# హలో గ్రేటర్.. చలో వరంగల్

**బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలివెళ్లేందుకు గ్రేటర్ గులాబీ దండు సమాయత్తమవుతున్నది. పార్టీ శ్రేణులను సిద్ధం చేసేందుకు బీఆర్ఎస్ నిర్వహిస్తున్న విస్తృతస్థాయి సమావేశాలు గులాబీ సేనల్లో ఉద్యమస్ఫూర్తిని రగిలిస్తున్నాయి. కేసీఆర్ బాటలో నడుస్తున్న గులాబీ కార్యకర్తలు పార్టీ పండుగ అంటే తమ ఇంట్లో పండుగని ప్రకటిస్తున్నారు. ఆనాడు శిథిలమైన తెలంగాణకు ఊపిరినివ్వడానికి ఎన్నో అవమానాలు, బెదిరింపులు, ఛీత్కారాలు, కేసులు ఎదుర్కొని నిలబడి పేండ్లుగా పోరాడి తెలంగాణ రాష్ట్ర సాకారమే లక్ష్యంగా కదిలిన కేసీఆర్‌కు ఎప్పటిలాగే జేజేలు పలకడానికి గ్రేటర్ ఈ నెల 27న బయలెల్లనుంది. ఈ మేరకు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఆయా నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో సమావేశం జరిగింది.**

సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు గ్రేటర్ గులాబీదళం అధిక సంఖ్యలో కదలాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజలు పదేండ్లు స్వర్ణయుగం చూశారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో ప్రజలు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. కేసీఆర్ విజన్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. బీఆర్ఎస్ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా భారీ బహిరంగ సభకు గ్రేటర్ నుంచి అధిక సంఖ్యలో గులాబీదళం తరలి వెళ్లడానికి సిద్ధమవుతున్నట్టు తెలిపారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ తెలంగాణకు మొదటి సీఎంగా అద్భుతమైన పరిపాలన అందించారని చెప్పారు. 27న జరిగే పండుగ తమ ఇంట్లో పండుగగా ప్రతి ఒక్క కార్యకర్త భావిస్తున్నట్టు పేర్కొన్నారు. అందులో భాగంగా నేడు, రేపు గోషామహల్, నాంపల్లి, కార్వాన్, ఖైరతాబాద్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ శ్రవణ్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం జరుగుతుందని వివరించారు. 13న నియోజకవర్గాల మీటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. 20న తెలంగాణ భవన్‌లో జనరల్ బాడీ మీటింగ్ ఉంటుందని చెప్పారు. 27న ప్రతీ డివిజన్‌లో గులాబీ జెండా ఎగురవేసి వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు బయల్దేరుతామని వెల్లడించారు. ఇప్పటికే ప్రజలందరూ కేసీఆర్ సభకు హాజరవ్వడానికి సిద్ధంగా ఉన్నారని వివరించారు.

# రాష్ట్రాన్ని రేవంత్‌రెడ్డి నాశనం చేస్తుండు

**చలో వరంగల్‌కు లక్షలాదిగా తరలిరావాలి**

**మాజీమంత్రి సబితారెడ్డి**

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 8: చలో వరంగల్‌కు లక్షలాదిగా తరలిరావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్యనాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రజతోత్సవ సభను విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అహర్నిశలు శ్రమిస్తే.. అదే రేవంత్‌రెడ్డి వినాశనం చేస్తున్నాడని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును వరంగల్ సభలో ఎండగడుతామన్నారు. జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రైతు బంధు జిల్లా మాజీ చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, రాజేంద్రనగర్ నియోజవకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, శంషాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు మోహన్‌రావు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరక్టర్ సతీశ్, మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పాషతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సైనికుల్లా కదిలిరావాలి..

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 8: బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు కోరారు. మంగళవారం కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభకు సైనికుల్లా కదిలొచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీశ్ ఆరోరా, కార్పొరేటర్లు నరసింహ యాదవ్, శ్రీనివాసరావు, శిరీషాబాబురావు, సత్యనారాయణ, సతీశ్, రవీందర్ రెడ్డి, సబియా బేగం, శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు శ్రావణ్ కుమార్,బాబురావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు గౌసుద్దీన్ పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి నేతలతో..**

శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ నేతలతో ఎమ్మెల్యే కృష్ణారావు సమావేశం నిర్వహించారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు కష్టపడి పనిచేసే నాయకులు.. కార్యకర్తలకు భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, రంగారావు, నాయకులు సతీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్, హరీశ్‌రావు, రోజా, రామకృష్ణ పాల్గొన్నారు.



క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ముఖ్యనేతల సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణారావు

# అప్పుడు మొక్కేటోళ్లు.. ఇప్పుడు తిడుతున్నరు

**కాంగ్రెస్ పాలనలో అధ్వానంగా వైద్యసేవలు**

**కేసీఆర్ కిట్ లేక సర్వీస్ సెంటర్లలో తగ్గిన ప్రసవాలు**

**యూపీహెచ్‌సీల్లో వెంటాడుతున్న సిబ్బంది కొరత**

సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలని ఎన్నికల ముందు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు ఇప్పుడు రాష్ట్ర ప్రజలను రాచిరంపాన పెడుతున్నారు. 15 నెలల పాలనలో నగరవాసులు పడుతున్న వెతలు వర్ణించలేనివి. కేసీఆర్ తన పదేళ్ల పాలనలో పేదవాడిచెంతకు ఉచిత వైద్యాన్ని తీసుకొచ్చి ఆరోగ్య తెలంగాణను నిర్మిస్తే, కాంగ్రెస్ పాలనలో వైద్యరంగం అనారోగ్యానికి గురవుతున్నది. నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ దవాఖానల్లో సేవలు దాదాపుగా నిలిచిపోయాయి. కేసీఆర్ పాలనలో వైద్యం చేసిన దవాఖానాలకు చేతులెత్తి మొక్కేటోళ్లు..కాంగ్రెస్ పుణ్యమా అని తిట్టుకుంటున్నరు.

**భర్తీ చేసేదెప్పుడు..?**

హైదరాబాద్ జిల్లా పరిధిలో 91 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీ) ఉన్నాయి. ఒక్కో యూపీహెచ్‌సీ సుమారు 10,000 మంది జనాభాకు వైద్యసేవలందించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 260 ఏఎన్ఎం సిబ్బంది, 1650 మంది ఆశ కార్యకర్తలు విధులు నిర్వహిస్తుండగా, ప్రస్తుతం ఇటీవల జరిగిన బదిలీల్లో 128 మంది ఏఎన్ఎంలు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా అధికారులు వదిలేశారు. 128 ఖాళీలకు గాను కేవలం 25 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకం చేసి ఉన్నవారిపైనే అదనపు పనిభారం మోపుతున్నారు. అంతేకాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూడు యూపీహెచ్‌సీలకు కలిపి ఒక్కరే మెడికల్ ఆధికారి ఉంటూ వైద్యసేవలందిస్తుండటం గమనార్హం. ఇంకొందరు మెడికల్ అధికారులు ఉదయం పదకొండు గంట కొట్టేవరకు సెంటర్లకు చేరుకోరు. ఏఎన్ఎంలతోనే సగం చికిత్స చేయిస్తారు. డాక్టర్‌కోసం బాధితులు ఎదురుచూసి చేసేదేమిలేక వెనుతిరుగుతున్నారు.




**సర్వీస్ సెంటర్ల పురోగతేమిటి..?**

బస్తీవాసులు, పేద ప్రజలకు సాధారణ ప్రసవాలు, 24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉండే విధంగా కేసీఆర్ సర్కారు జిల్లాలోని 9 సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇందులో ప్రసవాలకు కావాల్సిన పరికరాలు, ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. జిల్లాలోని బోరబండ, అరాజ్‌పెంట, పురానాపుల్-1, యాకత్‌పురా-1, దారుల్‌షిఫా, చార్మినార్, డాక్టర్ పాల్‌దాస్, గగన్ మహల్, బేగంపేట ప్రాంతాల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సర్వీస్ సెంటర్లలో గతంలో ప్రసవాలు అనుకున్న స్థాయిలో జరుగుతుండేవి. పేదలకు వరంగా మారిన కేసీఆర్ కిట్ ప్రభుత్వ వైద్య సేవలను గుండెలకద్దుకునేలా చేసింది. ఆ ప్రభావంతో ఆశలు నెలలో 6 వరకు ప్రసవాల కేసులు నమోదు చేయించి కేసీఆర్ కిట్‌ను అందించేవారు. కాంగ్రెస్ రాకతో కేసీఆర్ కిట్ పేరును మార్చి, ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చింది. అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటి వరకు ఎంసీహెచ్ కిట్లు ఇవ్వకపోగా, ప్రసవాలు కూడా తగ్గడం గమనార్హం. సర్వీస్ సెంటర్ల లక్ష్యానికి తూట్లుపొడిచే దిశగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అడుగులువేస్తోంది. గతంలో మాదిరిగానే నెలలో డెలవరీల నమోదు టార్గెట్ ప్రకారం చేయాలని మెడికల్ అధికారులు ఆశలకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వారికి చేదు అనుభవాలే ఎదురైతున్నాయి. ఎంసీహెచ్ కిట్ లేకపోవడం కారణంగా సర్వీస్ సెంటర్లకు వచ్చేందుకు బాధితులు అయిష్టంగా ఉన్నారు.




స్కూల్ ఫీజు చెల్లించలేదని విద్యార్థులను బంధించిన జూబ్లీహిల్స్ స్కూల్

# ఫీజు చెల్లించలేదని.. విద్యార్థులను బంధించారు

**రాంపల్లిలోని జూబ్లీహిల్స్ స్కూల్‌లో ఘటన**

కీసర, ఏప్రిల్ 8: ఫీజు చెల్లించలేదని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం దారుణానికి ఒడిగట్టింది. విద్యార్థులను బంధించి నానా ఇబ్బందులకు గురి చేసింది. రాంపల్లి దయారలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువున్న నలుగురు విద్యార్థులు స్కూల్ ఫీజు చెల్లించలేదు. మొత్తం రూ.1.30 లక్షలకు గాను లక్ష రూపాయలు కట్టగా మరో రూ.30 వేలు పెండింగ్‌లో ఉంది. దీంతో స్కూల్ యాజమాన్యం పెండింగ్ ఫీజు కట్టాలంటూ నాలుగో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులను మంగళవారం లైబ్రరీలో బంధించింది. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చిలికి చిలికి గాలివానలా ఈ విషయం మారడంలో పోలీసులు రంగ ప్రవేశం చేశారు.

# ఉరే సరి..

**ఎన్ఐఏ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**

**దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో నిందితుల పిటిషన్ డిస్మిస్**

**హర్షం వ్యక్తం చేసిన బాధిత కుటుంబాలు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో ఎన్ఐఏ కోర్టు తీర్పును సమర్థిస్తూ ఐదుగురు దోషులకు తెలంగాణ హైకోర్టు ఉరిశిక్షను ఖరారు చేసింది. బాంబు పేలుళ్ల కేసులో దోషుల పిటిషన్‌ను న్యాయస్థానం డిస్మిస్ చేసింది. ప్రధాన నిందితుడు రియాజ్ బత్కల్ పరారీలో ఉండగా, మిగతా అహ్మద్ సిద్దిబప్ప జరార్ అలియాస్ యాసిన్ బత్కల్, అబ్దుల్లా అక్తర్ అలియాస్ హద్ది, తహసీన్ అక్తర్, జియాఉర్‌రెహమాన్, అజిజ్‌షేక్ అనే ఐదుగురు నిందితులకు 2016లో ఎన్ఐఏ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఉరిశిక్షను విధించింది. ఎన్ఐఏ కోర్టు తీర్పును రద్దు చేయాలని నిందితులు హైకోర్టుకు అప్పీల్‌కు వెళ్లారు. వాదనల తరవాత మంగళవారం ఆ ఐదుగురు నిందితులు చేసిన అప్పీళ్లను తిరస్కరిస్తూ.. ఎన్ఐఏ కోర్టు తీర్పును హైకోర్టు సమర్థించింది. ఈ తీర్పు నేపథ్యంలో పేలుళ్ల ఘటనలో మృతులు, బాధితుల కుటుంబాలతో పాటు నగర ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పు కచ్చితంగా తమకు కొద్దిపాటి ఉపశమనం ఇచ్చినా తిరిగి నిందితులు హైకోర్టును ఆశ్రయించడంతో తీర్పుపై ఉత్కంఠ ఉండేదని, హైకోర్టు కూడా నిందితుల అప్పీల్‌ను డిస్మిస్ చేసి అదే శిక్షను సమర్థించడం తమకు ఆనందంగా ఉందని బాధిత కుటుంబాలు చెప్పాయి.

**అసలేం జరిగింది..!**

దిల్‌సుఖ్‌నగర్‌లో 2013 ఫిబ్రవరి 21న మొదటి పేలుడు రాత్రి 7గంటల సమయంలో మలక్‌పేట పీఎస్ పరిధిలోకి వచ్చే 107 నంబర్ బస్‌స్టాప్ వద్ద జరిగింది. కొద్ది క్షణాల వ్యవధిలోనే కోణార్క్ థియేటర్ సమీపంలోని ఏ 1 మిర్చి సెంటర్ వద్ద రెండో పేలుడు సంభవించింది. ఈ పేలుళ్ల ధాటికి మొత్తం 18 మంది మృత్యువాత పడగా, 131 మంది గాయపడ్డారు. ఈ పేలుడుపై సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి అప్పట్లో దర్యాప్తు ప్రారంభించారు. ఈ పేలుళ్ల ఘటనపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని భావించినా, కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (జాతీయ దర్యాప్తు సంస్థ)ను రంగంలోకి దించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నమోదైన రెండు కేసులు ఎన్ఐఏకి బదిలీ అయ్యాయి. దర్యాప్తు ప్రారంభించిన ఎన్ఐఏ ఈ పేలుళ్లకు పాల్పడింది ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థగా గుర్తించింది. దర్యాప్తులో భాగంగా అహ్మద్ సిద్దిబప్ప జరార్ అలియాస్ యాసిన్ బత్కల్, అబ్దుల్లా అక్తర్ అలియాస్ హద్ది, తహసీన్ అక్తర్, జియాఉర్‌రెహమాన్, అజిజ్‌షేక్ అనే ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పేలుళ్లకు కీలకసూత్రధారి అయిన మహ్మద్ రియాజ్ అలియాస్ రియాజ్ బక్తల్ ఇప్పటికీ పాకిస్తాన్‌లో తలదాచుకున్నట్లుగా ఎన్ఐఏ గుర్తించి అతడిపై రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేసింది. ఈ ఐదుగురు నిందితులను దోషులుగా గుర్తించిన ఎన్ఐఏ కోర్టు 2016 డిసెంబర్ 19న వారికి జైలుశిక్ష, జరిమానాలతో పాటు ఉరిశిక్ష విధించింది. కాగా ఎన్ఐఏ కోర్టు తీర్పుపై నిందితులు అదే ఏడాది తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం హైకోర్టు నిందితుల అప్పీల్‌ను డిస్మిస్ చేస్తూ ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.



బండ్లగూడలో కరెంట్ కోసం రోడ్డుపై వేచి చూస్తున్న స్థానికులు

# పోయిందంటే ఇక రాలే..

**బండ్లగూడలో మొదలైన కరెంట్ కష్టాలు**

బండ్లగూడ, ఏప్రిల్ 8: బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. చిన్నపాటి గాలి దుమారానికే కరెంటు ఉండటం లేదు. దీంతో ప్రజలు అనేక అవస్థలకు గురవుతున్నారు. కరెంటు కోసం అధికారులకు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో వచ్చిన గాలిదుమారానికి పలు ప్రాంతాల్లో వైర్లు తెగిపడటంతో స్థానికులు రాత్రంతా జాగారం చేస్తూ రోడ్లపైకి వచ్చారు. కిస్మత్‌పూర్‌లో ఓ బిల్డర్ పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టడంతో మెయిన్ విద్యుత్ లైన్ ఈ నిర్మాణానికి తగలడంతో కరెంట్ కట్ అయ్యిందని స్థానికులు తెలిపారు.

# సన్నబియ్యం అడిగినందుకు దాడి..

మలక్ పేట, ఏప్రిల్ 8: సన్న బియ్యం బదులు దొడ్డు బియ్యం ఇవ్వగా ఇదేమని ప్రశ్నించిన పాపానికి ఓ లబ్ధిదారుడిపై దాడి చేశారు. ఈ ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు పాత మలక్‌పేటకు చెందిన ఆటో డ్రైవర్ కత్తుల రవి సోమవారం ఉదయం ఆస్మాన్ ఘడ్‌లోని పౌరసరఫరాల పంపిణీ దుకాణం నం.111కు వెళ్లి సన్న బియ్యం ఇవ్వమని అడిగాడు. అయితే షాపు నిర్వాహకుడు శ్రీను దొడ్డుబియ్యం ఇస్తుండటంతో ఇదేమని ప్రశ్నించగా.. అందుకు డీలర్ శ్రీను ఎలక్షన్ కోడ్ ఉన్నందున తాను సన్న బియ్యం ఇవ్వలేనని, దొడ్డు బియ్యమే ఇస్తానని తెలిపారు. అన్ని షాపుల్లో సన్న బియ్యం ఇస్తున్నారని, మీరెందుకు ఇవ్వరని నిలదీయడంతో ఇష్టముంటే దొడ్డు బియ్యం తీసుకెళ్లు లేకుంటే లేదు అని డీలర్ దురుసుగా సమాధానం ఇచ్చాడు. ఇంతలో డీలర్ శ్రీను పక్కనే ఉన్న రాజు అనే వ్యక్తి జోక్యం చేసుకొని రవితో గొడవకు దిగి చెంపపై కొట్టాడు. దాంతో అక్కడే ఉన్న మరి కొంతమంది కార్డుదారులు జోక్యం చేసుకొని రాజును నిలదీయడంతో డీలర్ అతన్ని అక్కడి నుంచి పంపించి వేశాడు. జరిగిన ఘటనపై రవి మలక్ పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**• మహాత్ముడికి నివాళి**



అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటు కోసం మంగళ వారం ఇందిరాపార్కు ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొని పూలే విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

# చనిపోయేవరకు చితకబాదారు

**యాప్రాల్‌లో దారుణం**

**స్నేహితుడిని హతమార్చిన యువకులు**



ప్రణీత్(ఫైల్)

జవహర్‌నగర్: యాప్రాల్‌లో దారుణం జరిగింది. గంజాయి అమ్ముతున్నాడంటూ తప్పుడు ప్రచారం చేశాడన్న నెపంతో ఓ యువకుడిని తోటి స్నేహితులు దారుణంగా చితకబాదగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. యాప్రాల్ భగత్‌సింగ్‌కాలనీలో వెంకటనర్సయ్య కుటుంబం నివసిస్తున్నది. వెంకటనర్సయ్య రెండో కుమారుడు ప్రణీత్ (21) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రణీత్‌కు అదే కాలనీకి చెందిన గోవర్ధన్ మిత్రుడు. ప్రణీత్ చేస్తున్న ప్రచారాన్ని మనసులో పెట్టుకున్న గవర్ధన్.. ఈ నెల 5న గోవర్ధర్(27), జశ్వం త్(20), విన్సెంట్(19) కలిసి ప్రణీత్‌ను పిలుపించుకున్నారు. బైక్‌పై ఫుట్‌బాల్ మైదానానికి తీసుకెళ్లి చితకబాదారు. దీంతో అపస్మారక స్థితిలోకి ప్రణీత్ వెళ్లగా నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. గమనించిన స్థానికులు, జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న కుటుంబ సభ్యులు ప్రణీత్‌ను ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించగా ఈ నెల 6న గాంధీకి తరలించారు. చికిత్స పొందుతున్న ప్రణీత్ మంగళవారం ఉదయం మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గోవర్ధన్, జశ్వంత్, విన్సెంట్‌ను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించామని ఎస్‌హెచ్ఓ సైదయ్య తెలిపారు.